క్లుప్తంగా

గరుడవాహనంపై వెంకటేశ్వరుడు

మదనపల్లె సిటీ: గోవిందనామ స్మరణలతో గరుడవాహనంపై వెంకటేశ్వరుడు పురవీధుల్లో విహరించారు. స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయ బ్రహోత్సవాల్లో భాగంగా గరుడసేవకు శుక్రవారం కమ్మవీధి, రీడింగ్‌రూము వీధికి చెందిన ఉభయదారులుగా వ్యహరించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం అర్చకులు గోవర్ధన్‌భట్టార్ అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఆలయ ఈఓ రమణ, మాజీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఖాళీ స్థలాల లీజుపై నేడు అవగాహన

పీలేరు రూరల్ : కలికిరి బస్టాండు ఆవరణలో ఆర్టీసీ ఖాళీ స్థలాల లీజుపై శనివారం అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు పీలేరు డీఎం కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శనివారం మధ్యాహ్నం 3 గంటలకు కలికిరి ఆర్టీసీ బస్టాండులో సమావేశం ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు హాజరు కావాలని కోరారు. జిల్లా ప్రజా రవాణా అధికారి పి. రాము, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజరు (కమర్షియల్ కడప) రమేష్‌బాబు హాజరు అవుతారని తెలిపారు.

వెలిగల్లు సచివాలయం తనిఖీ

పెద్దమండ్యం: పెద్దమండ్యం మండలం వెలిగల్లు సచివాలయాన్ని శుక్రవారం డీఎల్‌పీఓ విజయకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలోని రికార్డులు పరిశీలించి, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్‌రావు, ఈఓపీఆర్‌డి జనార్ధన్, పంచాయతీ కార్యదర్శి శైలజ, సర్పంచులు మొలక బయ్యారెడ్డి, సరస్వతి పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్టు

కలికిరి: నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి సారా స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్‌ఐ మధుసూదనాచారి తెలిపారు. పట్టణ పరిధిలోని ఇందిరమ్మకాలనిలో నాటు సారా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. ఇందిరమ్మకాలనీకి చెందిన గంగాధర నాటు సారా విక్రయిస్తున్నట్లు గుర్తించి, అతని నుంచి వాటర్‌క్యాన్‌లో ఉంచిన న20లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు

కలకడ : ప్రభుత్వం అందించే ఉచిత వ్యాధినిరోధక టీకాలు 18సంవత్సరాల వయస్సులోపు చిన్నారులకు తప్పనిసరిగా వేయించాలని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని కదిరాయచెర్వు గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరం నిర్వహించారు. 52 మందికి సాధారణ వైద్యసేవలు, ఆరుగురు గర్భిణులకు రక్తపరీక్షలు చేశారు. మాత,శిశు సంరక్షణపై జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, పీహెచ్‌ఎన్ ముజీబ్‌బాషా, రెడ్డెమ్మ, సిబ్బంది శ్రీలక్ష్మి, లావణ్య, రోజా, రమేష్‌బాబు, సుజాత, కుమారి తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రమణ మృతి పార్టీకి తీరని లోటు

కలకడ : మండలంలోని గంగాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ముల్లగూరి వెంకట్రమణ మృతి వైఎస్సార్‌సీపీకి తీరనిలోటని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం గంగాపురం గ్రామానికి వెళ్లి నివాళి అర్పించి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, సర్పంచ్ రామచంద్ర నాయకులు శ్రీనివాసులురెడ్డి, బివి నాయుడు, కుమార్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు నివాళి అర్పించారు.

మసీదుల అభివృద్ధికి కృషి

నిమ్మనపల్లె : మసీదులు, ఈద్గాల అభివృద్ధికి వక్ఫ్‌బోర్డు ద్వారా కృషి చేస్తామని వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు కరీముల్లా అన్నారు. శుక్రవారం మండలంలోని చల్లావారిపల్లె మసీదులో ప్రార్థనలో పాల్గొని ముస్లిం మత పెద్దలతో సమావేశమయ్యారు. మసీదుల అభివృద్ధి, మౌలిక సౌకర్యాల కల్పనకు ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా సహకారంతో కృషి చేస్తామన్నారు. వక్ఫ్‌బోర్డు నిధులు మంజూరు చేయించి సమస్యల పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు మస్తాన్, ఖాదర్‌బేగ్, ఖాదర్‌బాషా, అంజాద్, నూర్‌మొహిద్దీన్‌ఖాన్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా వెంకటస్వామి

మదనపల్లె సిటీ: ఏపీ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా వెంకటస్వామి, జిల్లా సంయుక్త కార్యదర్శిగా రెడ్డి కిరణ్‌లను నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు సుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం మదనపల్లెలో సంఘం కార్యాలయంలో వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి శంకర్, రాష్ట్ర కార్యదర్శి బి.సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయికెళ్లి సమస్యలు పరిష్కరించాలి

మండల మీట్‌లో ఎమ్మెల్యే నవాజ్ బాషా


మండల మీట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : ప్రజాప్రతినిధులతో కలిసి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి స్థానిక సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రెడ్డెమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు తమ శాఖల త్రైమాసిక ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. శాఖలవారిగా ఎమ్మెల్యే సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యాన, పట్టు పురుగు శాఖల అధికారులు గ్రామాలకు వెళ్లి ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని గ్రామసభలు ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పంటనష్టం రాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలను వివరించి పంటసాగులో మార్పులు తెచ్చేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ రాయితీ పథకాల ద్వారా రైతులు లబ్ధిపొందేలా పని చేయాలన్నారు. ఆరోగ్యశాఖ సమీక్షలో భాగంగా కొందరు కమీషన్ల కోసం గర్భిణులను ప్రైవేటు ఆసుపత్రులకు పంపుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. వారు చికిత్స పొందిన అనంతరం సహాయనిధి కోసం తన వద్దకు వస్తున్నారని, ఆరోగ్యశ్రీ ప్రభుత్వ వైద్యశాలలో అందుబాటులో ఉండగా ప్రైవేటు ఆసుపత్రులకు ఎందుకు పంపుతున్నారని పీహెచ్‌సీ వైద్యులను ప్రశ్నించారు. మరోసారి ప్రైవేటు ఆసుపత్రులకు తరలించినట్లు తెలిస్తే ఉపేక్షించేది లేదన్నారు. రెండో విడత నాడు – నేడు పనులు వేగంగా పూర్తి చేసేందుకు సిమెంటు సమస్యగా ఉందని ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్‌శాఖల్లో చేసిన పనులకు బిల్లులు మంజూరు కాలేదని, సర్పంచులు శరత్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డిలు అధికారుల దృష్టికి తెచ్చారు. త్వరలోనే పనుల బిల్లులు మంజూరవుతాయని, అధికారులు వివరించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు లేకపోవడం వల్ల తాగునీటి సమస్య ఏర్పడిందని పెంచుపాడు ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎక్సైజ్ అధికారులు సమావేశానికి హాజరుకాకపోవడం పట్ల ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్సైజ్ అధికారులకు నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో గ్రామాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో సింగల్‌విండో అధ్యక్షులు దండు కృష్ణారెడ్డి, వైస్‌ఎంపీపీలు వెంకటరమణ, నందినితాజ్, వెలుగు చంద్ర, ఏఎంసీ వైస్ చైర్మన్ వెంకటరమణ, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, ఈవోపీఆర్డీ వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు

మదనపల్లె : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కుల, మత, వర్గ, పార్టీ విభేదాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శుక్రవారం పట్టణంలోని 33వ వార్డు నీరుగట్టువారిపల్లె మాయాబజార్, వివేకానంద స్కూల్ తదితర ప్రాంతాల్లో కౌన్సిలర్ ఎంవీ.రమణ ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం గత నాలుగేళ్లలో అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని సూచించే బుక్‌లెట్‌లను వారికి అందించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థతో పాలనను ప్రజల చెంతకే తెచ్చిన ఘనత వైఎస్సార్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ కేంద్రాల ద్వారా ప్రజలు, రైతులకు తక్షణ సేవలు అందుతున్నాయన్నారు. నవరత్న పథకాలతో ప్రతి ఇంటిలో సంక్షేమ కాంతులు నిండాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మనూజారెడ్డి, కమిషనర్ ప్రమీల, కౌన్సిలర్లు శ్రీనివాసులు, చంద్రశేఖర్, కరీముల్లా, వసీం, శివారెడ్డి, నాయకులు ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరు రఫీ, జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు జాన్‌బాబు, తొగట కార్పొరేషన్ డైరెక్టర్ శీలం రమేష్, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ దండు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరు ఈదలవంక పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన ఉబ్బు గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట శనివారం నిర్వహించనున్నట్లు చాకల వ్యాసముద్రం, బత్తాలాపురం కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. పీటీఎంకు చెందిన సనగరం పట్టాభి రామయ్య ప్రత్యేక చొరవ తీసుకోవడంతో టీటీడీ తరపున గంగమ్మ విగ్రహాన్ని అందజేసారన్నారు. విగ్రహ ప్రతిష్టతో పాటు ప్రాణ ప్రతిష్ట, కళా హోమం, పూర్ణాహుతి, మహా మంగళ హారతి, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.50 వేల విరాళం

నిమ్మనపల్లె : మండలంలోని తవళం గ్రామం యోగనేలమల్లేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి చౌకిళ్లవారిపల్లెకు చెందిన మాజీ సైనిక ఉద్యోగి పెద్దిరెడ్డి సురేంద్రరెడ్డి రూ.50 వేల విరాళం అందించారు. మదనపల్లె శివనగర్‌లో నివసిస్తున్న సురేంద్రరెడ్డి శుక్రవారం నిమ్మనపల్లె వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి గారబురుజు రమణారెడ్డికి రూ.50వేల చెక్‌ను అందజేశారు. రూ.3 కోట్లతో నేలమల్లేశ్వర స్వామి ఆలయం అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అయితే సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.60 లక్షలు డిపాజిట్ చేయాల్సి ఉండగా తనవంతు సాయంగా ఆలయ అభివృద్ధికి విరాళం ఇవ్వడం ఆనందంగా ఉందని సురేంద్రరెడ్డి చెప్పారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించండి

– డీసీహెచ్‌ఎస్ చంద్రశేఖర్


జిల్లా ఆస్పత్రి వైద్యులతో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ చంద్రశేఖర్

మదనపల్లె : ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యశాలల సమన్వయ అధికారి (డీసీహెచ్‌ఎస్) చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని తనిఖీ చేశారు. ముందుగా వివిధ వార్డుల్లో ఉన్న రోగులను పరామర్శించారు. వారికి అందుతున్న వైద్యసేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి వైద్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రిలో కాన్పులు, సిజేరియన్ల సంఖ్య పెంచుతూ మాతా శిశు మరణాల నివారణకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే సిజేరియన్, కాన్పులు అయ్యేలా రెఫరల్ కేసులు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉండేలా వైద్య సేవలు అందాలన్నారు. మెటర్నిటీ కేసులను బలమైన కారణం ఉంటేనే రెఫర్ చేయాలని, సాధ్యమైనంత వరకు ఆసుపత్రిలోనే చికిత్సలు అందించాలన్నారు. మాతా శిశు మరణాలకు కారకులైతే ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవలను విస్తృతం చేస్తూ ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలన్నారు. ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అనంతరం ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ పద్మాంజలి దేవి, ఆర్‌ఎంవో సరస్వతమ్మపాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లోనే మెరుగైన వైద్యం

వాల్మీకిపురం: ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా డీసీహెచ్‌ఎస్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఆయన వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం ప్రసూతి వార్డులు, ఎక్స్‌రే, ఈసిజి, వార్డులు, నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాన్పుల సంఖ్య పెంచాలని, శస్త్ర చికిత్సలు, రక్తకణాల పరీక్షలు, కిడ్నీ, కాలేయ, రక్తపు గ్రూపు, రక్తహీనత, హిమోగ్లోబిన్, మధుమేహం తదితర రకాల పరీక్షలు వేగవంతం చేయాలన్నారు. వైద్యులందరూ కలసి కట్టుగా సేవలందిస్తూ ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రిని త్వరితగతి పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం, డాక్టర్లు లేఖ్య, సోని, సిబ్బంది సుధాకర్, బాబాసాబ్, భాస్కర, జావిద్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు యోగాపై అవగాహన

మదనపల్లె : గర్భిణులకు యోగాపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జోష్న మెటర్నిటీ అండ్ జనరల్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒక గంట వరకు కదిరి రోడ్డులోని శ్రీ కృష్ణ కళ్యాణ మండపంలో యోగా టీచర్ వైష్ణవి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. గర్భధారణలో వచ్చే అనారోగ్య సమస్యలు, సాధారణ కాన్పు కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కేవీపల్లె : స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో 2023–24 విద్యాసంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రెడ్డిప్రదీప్ కోరారు. ప్రవేశ పరీక్ష రాయడానికి ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 75 చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు స్థానిక పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

టమాటా రైతులను ఆదుకోవాలి

ములకలచెరువు: టమాటాకు తగిన గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి కోరారు. స్థానిక రైతు సంఘం నాయకులతో కలసి శుక్రవారం మండలంలోని చౌడసముద్రం వద్ద టమాటా పంటను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎకరా సాగుకు రూ. 2 లక్షల దాకా ఖర్చు అవుతోందన్నారు. కనీసం కూలీల ఖర్చులకు కూడా రాని విధంగా రేటు ఉందన్నారు. అంతేగాకుండా కనీసం సాగు ఖర్చులు కూడా రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుని టమాటా రైతులను ఆదుకోవాలని కోరారు. నాయకులు అంజనప్ప, ఎం. హరికుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై స్పందించాలి

మదనపల్లె సిటీ: ఎస్సీ రిజర్వేషన్ల పంపిణీలో ఏడు దశాబ్దాలుగా జరుగుతున్న అసమానతలను తొలగించి, ఎస్సీ వర్గీకరణ ద్వారా మాదిగ, ఉప కులాలకు న్యాయం జరిగేలా బీఎస్పీ అధినేత్రి మాయావతి స్పందించాలని ఎంఆర్‌పీఎస్ ఉమ్మడి చిత్తూరు జిల్లా ఇన్‌చార్జ్ నరేంద్రబాబు తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 7న హైదరాబాదులో జరుగుతున్న తెలంగాణ భరోసాకు ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో నడుస్తున్న ఉద్యమానికి అన్ని జాతీయ, ప్రాంతీయ పార్టీలు మద్దతు ఇస్తున్నాయన్నారు. బీఎస్పీ కూడా అనుకూలంగా ప్రకటన చేయాలని కోరుతూ శనివారం అన్ని మండల, నియోజకవర్గ కేంద్రాల్లో అంబేడ్కర్, బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహాల ఎదుట ప్రదర్శన చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి నియోజకవర్గ ఇన్‌చార్జ్ వాసు, కో ఇన్‌చార్జ్ మనోహర్, నాయకులు రాజా, రవి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఓబీ బాధితులకు త్వరలో నష్టపరిహారం

పీలేరు రూరల్ : స్థానిక చిత్తూరు రోడ్డు మార్గంలో చిత్తూరు – కర్నూలు జాతీయదారి – 18 పై నిర్మించనున్న రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి భూములు, ఇళ్లు కోల్పోయిన బాధితులకు త్వరలో పరిహారం ఇవ్వనున్నట్లు రాయచోటి ఆర్‌డీవో రంగస్వామి తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాధితులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొదటి విడత 56 మంది పట్టాదారు రైతులకు నష్టపరిహారంగా రూ. 8 కోట్లు మంజూరైందన్నారు. ఇప్పటి వరకు రూ. 1.90 కోట్లు పంపిణీ చేశామని, త్వరలో రూ. 3.32 కోట్లు పంపిణీ చేస్తామని తెలిపారు. ఆర్‌వోబీకి 0.58 ఎకరాల స్థలం అవసరం ఉందని, అందుకు సంబంధించి 56 మంది బాధితులతో సమావేశం నిర్వహించి అభ్యంతరాలు స్వీకరించినట్లు చెప్పారు. ఎన్‌హెచ్ డీఈ సత్యమూర్తి, తహసీల్దార్ ప్రదీప్, డీటీ మురాషావలి, ఆర్‌ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం


శ్రీనివాసుని కల్యాణం నిర్వహిస్తున్న దృశం


శ్రీలక్ష్మీనరసింహుడి కల్యాణోత్సవం

పీలేరు : స్థానిక కడపరోడ్డు మార్గంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మొలకల పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీనివాసుని కల్యాణం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం వెంకటేశ్వరస్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. అనంతరం శ్రీనివాసులు కల్యాణం వేద పండితులు మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు. తిరుపతికి చెందిన అన్నపూర్ణ క్యాటరింగ్ చలపతి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి, గంగిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మినరసింహుని కల్యాణం

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణోత్సవం కన్నులపండుగగా జరిగింది. శుక్రవారం స్వాతి నక్షత్రం కావడం, ఇదేరోజు స్వామివారి జన్మదినం కావడంతో టీటీడీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీ వెంగమాంబ ప్రాజెక్టు కళాకారుల ఆధ్వర్యంలో నిర్వహించిన పలు కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకొన్నాయి. ముందుగా మూలవర్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితులు మంత్రోచ్ఛారణల మధ్య మేళతాళాలతో శాస్త్రోక్తంగా మాంగల్యధారణ కావించారు. రూ.300 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గోన్న దంపతులకు టీటీడీ వారు పట్టువస్త్రాలు, కంకణాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. పెద్ద ఎత్తున భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొని స్వామివారిని సేవించుకొన్నారు.


అధికారుల్లో జవాబుదారీతనం ఉండాలి

– ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి

పీలేరు : ప్రజా సమస్యలపై మండల స్థాయి అధికారుల్లో జవాబుదారీ తనం ఉండాలని ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు మండల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది తమవంతు సహకారం అందించాలని కోరారు. ఖరీఫ్ సీజన్‌కు రైతులకు సరిపడా వేరుశనగ విత్తనాలు సిద్ధం చేయాలని వ్యవసాయ అధికారులను కోరారు. మండలంలో రైతులకు, అలాగే గృహ అవసరాలకు విద్యుత్ లో ఓల్టేజీ సమస్య పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు. గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేస్తే బిల్లులు సకాలంలో వస్తున్నట్లు చెప్పారు. మండలంలో ఎస్సీ, ఎస్టీ వసతిగృహాల్లో నీటి సమస్య లేకుండా సంబంధిత అధికారుల చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని సిబ్బంది బ్రాండెడ్ మద్యంను బయట ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని సెబ్ అధికారులు దృష్టి సారించాలన్నారు. రైతు సంఘాలకు వరికోత యంత్రాలు ప్రభుత్వం 40 శాతం రాయితీతో అందిస్తోందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సింగిల్‌విండో చైర్మన్ బి.డి. నారాయణరెడ్డి మాట్లాడుతూ మండలానికి నాబార్డు ద్వారా పది వ్యవసాయ గోడౌన్లు మంజూరయ్యాయని, అయితే రెవెన్యూ అధికారులు స్థలం చూపించడంలో అలసత్వం వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు చలపతి, హరిత, మండల కోఆప్షన్ సభ్యుడు రెడ్డిబాషా, ఎంపీడీఓ మురళీమోహన్‌రెడ్డి, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పింక్ బస్ వైద్యశిబిరానికి స్పందన


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్, స్విమ్స్ వైద్యులు

కలికిరి: మండలంలోని మేడికుర్తిలో తిరుపతి స్విమ్స్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పింక్ బస్ వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. మండల ప్రత్యేక ఆహ్వానితుడు రత్నశేఖర్ రెడ్డి, సర్పంచ్ నాగవేణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్ రెడ్డిల ఆధ్వర్యంలో ప్రారంభించిన ఈ శిబిరంలో మేడికుర్తి గ్రామంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన 60 మంది మహిళలకు ఉచిత కేన్సర్ పరీక్షలు నిర్వహించారు. స్విమ్స్ కళాశాల వైద్యుల బృందం సాహిత్య, ఆశ్రిత, కుసుమ ప్రియ, కృష్ణ ప్రియ, కామాక్షి, కీర్తన, నిరుపమ, ఎ.వి.చైతన్యభాను మహిళలకు మొబైల్ మెమోగ్రఫీ, పాస్‌స్మియర్, నోటి పరీక్షలు, అల్ట్రాసౌండ్, బ్రెస్ట్, ఓరల్ క్యావిటీ, గర్భాశయ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ యువనాయకుడు తరుణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్విమ్స్ పీఆర్‌ఓ రాజశేఖర్, ఎంపీటీసీ సభ్యుడు అల్లాబక్షు, డా.ఎవి రమణ, మధుసూదన్ రెడ్డి, మహేంద్రరెడ్డి, మల్‌రెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ పున్నమి వేడుకలు


ధమ్మవందనం చేస్తున్న బౌద్ధ ఉపాసకులు

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లెవద్దనున్న బుద్ధునికొండలో శుక్రవారం ఘనంగా బుద్ధపున్నమి వేడుకలు నిర్వహించారు. బుద్ధ అంబేడ్కర్ సమాజ్, భారతీయ అంబేడ్కర్ సేవ సంయుక్తంగా పీటీఎం శివప్రసాద్ నేతృత్వంలో ఈ వేడుకలు నిర్వహించారు. బౌద్ధ ఉపాసకులు, బౌద్ధ అభిమానులు బోధి వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం పుష్ప, దీప, దూపాలతో తథాగతుడు గౌతమబుద్ధుని అభిషేకించి, త్రికరణ, పంచశీలాలను పఠించి బుద్ధ వందనం చేశారు. అన్ని దేశాల్లో జరిగే అతి పెద్ద పండుగ బుద్ధపున్నమి అని తెలిపారు. ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లకు బౌద్ధం పరిష్కారం చూపగలదని తెలిపారు. ప్రజాకవి రెడ్డప్ప, ఉపాసకులు లక్ష్మినారాయణ, మునివెంకటప్ప, సోమశేఖర్, చిన్నప్ప రమణ, బయన్న పాల్గొన్నారు.

కల్యాణ మండపాన్ని ప్రారంభించిన మంత్రి


కల్యాణమండపం ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

బి.కొత్తకోట: స్థానిక బత్తలాపురంరోడ్డులో నూతనంగా నిర్మించిన పీఎస్‌ఆర్ కల్యాణ మండపాన్ని రాష్ట్ర విద్యుత్, ఆటవీ, గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిలతో కలిసి ప్రారంభించారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. బి.కొత్తకోట బీసీకాలనీకి చెందిన దివ్యాంగుడు టి.రాజశేఖర్ తన సమస్యను మంత్రికి చెప్పుకోవాలని ఎదురుచూస్తుండగా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అతన్ని స్వయంగా మంత్రి దగ్గరకు తీసుకెళ్లారు. నడవలేని తనకు ఎలక్ట్రిల్ వాహనం కావాలని కోరగా మంజూరుకు హామీ ఇచ్చారు. పత్రవారిపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త శివ ఇటీవల మృతి చెందగా..కుటుంబీకులు మంత్రిని కలవగా ఆదుకునేందుకు రూ.50వేల ఆర్థిక సహాయం ప్రకటించారు. కాగా బి.కొత్తకోటకు వస్తున్న మంత్రికి మొగసాలమర్రి వద్ద బయ్యప్పగారిపల్లె సర్పంచు వై.లక్ష్మీదేవమ్మ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు.

రైతుల గురించి మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదు

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కేవీపల్లె : తన హయాంలో వ్యవసాయ రంగాన్ని పట్టించుకోని చంద్రబాబు నాయుడుకు రైతుల గురించి మాట్లాడే అర్హత లేదని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే మండలంలోని గర్నిమిట్ట పంచాయతీ బలిజపల్లె, గర్నిమిట్ట కస్బా, చింతమాకులపల్లెలో విస్తృతంగా పర్యటించారు. చింతమాకులపల్లెలో విలేకరులతో మాట్లాడుతూ ఏలూరులో చంద్రబాబు ప్రకృతి వైపరిత్యంతో తడిసిన ధాన్యం చూపిస్తూ ముఖ్యమంత్రి పట్టించుకోవడం లేదనడం, రైతులను విస్మరిస్తున్నారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వ్యవసాయం దండుగ అన్న చంద్రబాబు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని అభివర్ణించారు. చంద్రబాబు హయాంలో రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం దారుణంగా ఉండేదన్నారు. చెప్పులు క్యూలో పెట్టడం, పోలీసులను మొహరించడం, లాఠీ చార్జీలు, గెంటివేత లాంటి సంఘటనలు ఉండేవని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి పాలనలో రైతు భరోసా కేంద్రాలతో ప్రశాంతంగా ఓ పద్ధతి ప్రకారం రైతులకు విత్తనాలు, ఎరువులు ఇవ్వడం జరుగుతోందన్నారు. బడ్జెట్‌లో సింహభాగం డ్రిప్ ఇరిగేషన్‌కు కేటాయించినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నీటిపారుదల, వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను తక్షణం పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ గజ్జెల శృతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, యువజన విభాగం మండల కన్వీనర్ గజ్జెల శీనరెడ్డి, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రదీప్‌రెడ్డి, సర్పంచ్ రమణమ్మ, వైస్ సర్పంచ్ వేణుగోపాల్, నాయకులు రవీంద్రరెడ్డి, హరిబాబు, సి.కె. యర్రమరెడ్డి, నాగరాజ, సుబ్రమణ్యం, రవి, వెంకటరాము, మల్లికార్జునరెడ్డి, శివ, పి. ద్వారకనాథరెడ్డి, రాంప్రసాద్‌నాయుడు, రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంతలు తవ్వారు..పూడ్చడం మరిచారు


టెలికాం వారు తవ్విన గుంతలో ఇరుక్కున్న కారు

కలికిరి: ప్రైవేటు టెలికాం కంపెనీల సిబ్బంది కలికిరి పట్టణంలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరపడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. స్థానిక రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండ్, క్రాస్ రోడ్డు గాంధీ కూడలి వరకు రోడ్డుకు ఇరువైపులా అక్కడక్కడా సుమారు నాలుగు అడుగుల లోతు గుంతలు నెలక్రితం తవ్వారు. అయితే వీటిని పూడ్చడం మరిచారు. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. శుక్రవారం రాత్రి వర్షం కురుస్తుండటంతో పలువాహనదారులు టెలికాం కంపెనీ వారు తవ్విన గుంతల్లో పడి ఇరుక్కున్నాయి. సంబంధిత ఆర్అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ లోపంతో ఇలా ప్రైవేటు కంపెల ప్రతినిధులు వ్యవహరిస్తున్నారని, ఇప్పటికైనా ఆర్‌అండ్‌బి అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.